TGTEL/26/A4015

తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ 09, బుధవారం, సెప్టెంబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 125 తెలుగువారి పత్రిక..... మీ కోసం

రిపోర్టర్లు కావలెను
తెలంగాణ మంజీరా
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న
తెలంగాణ మంజీరా
మీకు సరైన వేదిక... అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది.
98496 38320

ఇద్దరం రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళదాం

: రేవంత్ రెడ్డికి కౌశిక్ రెడ్డి సవాల్

ఉప ఎన్నికలో రేవంత్ డిపాజిట్ తెచ్చుకుంటే ముక్కు నేలకు రాస్తానన్న కౌశిక్ రెడ్డి

అసెంబ్లీలో రేవంత్ వాడిన భాష అసహ్యకరంగా ఉందని విమర్శ

తెలంగాణ మంజీరా సెప్టెంబరు08

కత్తులతో నరుకుతామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారని మండిపాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. “కొడంగల్ స్థానానికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి. హుజూరాబాద్‌లో నేను కూడా రాజీనామా చేస్తా. మళ్లీ జరిగే ఉపఎన్నికలో రేవంత్ రెడ్డి డిపాజిట్ తెచ్చుకుంటే సభ సాక్షిగా ముక్కు నేలకు రాస్తా” అని ఛాలెంజ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, శాసనసభ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగించిన భాష, పదజాలం అసహ్యకరంగా ఉన్నాయని, తెలంగాణ సమాజమంతా ఈ అభ్యంతరకర వైఖరిని గమనిస్తోందని మండిపడ్డారు. సభలో ప్రతిపక్ష సభ్యులను గౌరవించకుండా సీఎం ఇష్టానుసారంగా మాట్లాడారని కౌశిక్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలోనే ‘కత్తులతో నరుకుతాం’ అని బహిరంగంగా బెదిరింపులకు దిగారని గుర్తు చేశారు. ఇవన్నీ పక్కనబెట్టి తమపై ఎథిక్స్ కమిటీ పేరుతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై కడియం శ్రీహరి చేస్తున్న విమర్శలకు కౌశిక్ రెడ్డి ఘాటుగా సమాధాన మిచ్చారు. “కోట్లాది రూపాయల నిధులతో పాటు బీఆర్ఎస్ పార్టీ బీ-ఫారమ్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన వ్యక్తి కడియం శ్రీహరి. డిప్యూటీ సీఎంగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా పదవులు అనుభవించినప్పుడు ఆయనకు లేని నైతిక విలువలు ఇప్పుడు గుర్తు కొస్తున్నాయా?” అని నిలదీశారు.

మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?

సీతక్క ఫైర్

- దళిత వర్గానికి చెందిన స్పీకర్ కు గౌరవం ఇవ్వడం లేదన్న సీతక్క
- సబితను తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుందన్న మంత్రి
- మహిళా పోలీసు అధికారులపై బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని వెల్లడి

తెలంగాణ మంజీరా సెప్టెంబరు08

శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైన, అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరుగనట్లు తప్పించుకోవాలని చూస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.“సభలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వకపోగా, గతంలో ఎప్పుడో మరణించిన ఆయన మాతృమూర్తిని ఉద్దేశించి అంత నికృష్టమైన భాష మాట్లాడటం ఏ రకమైన సంస్కారం?” అని నిలదీస్తూ కంటతడి పెట్టారు. సీతక్క ఆవేదన చూసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకోవడంతో వాతావరణం అత్యంత గంభీరంగా మారింది. సభలో ప్రతిపక్ష నేతల తీరుపై మండిపడ్డ సీతక్క... “సబితా ఇంద్రారెడ్డిని నిజంగా తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుంది. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రావడం ఏంటి? హరీశ్ రావు మహిళల ముందు బట్టలు విప్పుతారా?” అని సంచలన వ్యాఖ్యలు చేశారు. “మహిళా ప్రజాప్రతినిధులను సురక్షిత ప్రాంతానికి పంపి, ఆ తర్వాత పురుష నేతలు నిరసనకు రావడం పద్ధతి. కానీ మహిళలను అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేయడం దారుణం” అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారులపై బీఆర్ఎస్ నేతలు చేయిచేసుకుని, దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని, చట్టాన్ని ఉల్లంఘించి పోలీసులను కొట్టిన ఎమ్మెల్యేలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభలు దేవాలయం లాంటివని, బీఆర్ఎస్ మహిళా నేతలు ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. “సొంత చెల్లెలు కవితను పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు లేని బాధ, హరీశ్ రావును ఏదైనా అంటే ఎందుకు వస్తోంది?” అని సీతక్క బీఆర్ఎస్ నేతలను సూటిగా ప్రశ్నించారు.

మన్నె క్రిశాంక్‌ను అరెస్టు చేసి, బలవంతంగా తీసుకెళ్లిన పోలీసులు

తెలంగాణ మంజీరా సెప్టెంబరు08

అసెంబ్లీ సమావేశాల వేళ రాష్ట్రవ్యాప్తంగా అక్రమ అరెస్టులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇంట్లో నుంచి బలవంతంగా అరెస్టు చేసి తీసుకెళ్లారు. వాహనంలో కార్ఖానా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మన్నె క్రిశాంక్ అరెస్టుకు ముందు ఆయన నివాసం వద్ద కార్ఖానా సీఐ అనురాధ వీరంగం సృష్టించారు. ఇంట్లో చిన్న పాప ఉంది.. నా భర్త ఇంట్లో లేడని క్రిశాంక్ సతీమణి సుహాసిని చెప్పినప్పటికీ వినకుండా ఇంట్లోకి వస్తానంటూ సీఐ పట్టుబట్టారు. ఈ క్రమంలో ఆవేశంతో రెచ్చిపోయిన సీఐ.. క్రిశాంక్ ఇంట్లో పనివాళ్లపై బూతులతో చెలరేగారు. లోపలేస్తా నా కొడకా.. తమాషా చేస్తున్నారా అంటూ వార్నింగ్ ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.





‘నా తల్లిని అవమానించారు దానికి ఏం చెబుతారు?’

: హరీశ్ రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆగ్రహం

- అసెంబ్లీలో తాతా మధు వ్యాఖ్యలపై తీవ్ర దుమారం
- హరీశ్ రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆగ్రహం
- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల తీరుపై హరీశ్ ఫిర్యాదు
- ఘటనపై విచారణకు ఆదేశించామని స్పీకర్ వెల్లడి
- తన తల్లిపై వ్యాఖ్యలపై హరీశ్‌ను నిలదీసిన స్పీకర్

తెలంగాణ మంజీరా సెప్టెంబరు08

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల రెండో రోజు కూడా వాడీవేడిగా సాగుతోంది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు సభలో తీవ్ర దుమారం రేపాయి. ఈ అంశంపై చర్చ జరుగుతుండగా బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.హరీశ్ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ.. మహిళా నేతలపై దాడి జరిగిందన్న ఆరోపణలపై ఇప్పటికే విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. నివేదిక వచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అదే సమయంలో తాతా మధు తన తల్లిపై చేసిన వ్యాఖ్యల అంశాన్ని స్పీకర్ ప్రస్తావించారు. “నా తల్లిని అవమానించిన అంశంపై ఏం చెబుతారు?” అంటూ హరీశ్ రావును ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే స్పీకర్, హరీశ్ రావు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.మరోవైపు మంత్రి సీతక్క కూడా ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ తల్లిని అవమానిస్తే ప్రధాన ప్రతిపక్షం కనీసం విచారం వ్యక్తం చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. మహిళా పోలీసుల ఎదుట బీఆర్ఎస్ నేతలు చొక్కాలు విప్పి విసిరేశారని ఆరోపించారు. అంతేకాకుండా వారిపై దాడికి కూడా పాల్పడ్డారని అన్నారు.

కేసీఆర్ హత్యకు కుట్ర..

కేసీఆర్‌కు రక్షణ కల్పించాలి

- బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే..కేటీఆర్ సంచలన ఆరోపణలు
- కేసీఆర్‌కు భద్రతపై పోలీసులపై నమ్మకం లేదు
- మన నాయకుడు కేసీఆర్ ను మనమే కాపాడుకోవాలి
- ఫామ్‌హౌస్‌కు వెళ్తుండగా కేటీఆర్ అరెస్ట్?
- హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతల అరెస్టులు
- బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద రణరంగం..
- రాళ్లు, కుర్చీలతో బీఆర్ఎస్, కాంగ్రెస్ దాడులు

మిగతా 2 లో

ప్రధాని పర్యటనలో తుపాకీ కలకలం

పీఎంవో అధికారినంటూ ఎంట్రీకి యత్నం



ముంబై,సెప్టెంబర్8(తెలంగాణ మంజీరా): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబై పర్యటనకు ముందు బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ (లో భద్రతా కలకలం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ పాల్గొననున్న కార్యక్రమం జరిగే ప్రాంతంలో ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు తాను ప్రధానమంత్రి కార్యాలయం అధికారినని చెప్పుకున్నట్లు సమాచారం. అతని వద్ద నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక వివరాల ప్రకారం, ముంబైలోని నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ప్రాంగణంలో ఈ ఇద్దరిని గుర్తించారు. నకిలీ గుర్తింపు కార్డుతో ఉన్న వ్యక్తిని 24 ఏళ్ల రోహన్ పరేఖ్‌గా గుర్తించారు. అతనితో పాటు ఉన్న అంగరక్షకుడి వద్ద తుపాకీ ఉన్నట్లు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. భద్రతా సిబ్బంది తనిఖీల్లో గుర్తింపు కార్డు అనుమానాస్పదంగా కనిపించడంతో పరిశీలించగా అది నకిలీదని తేలింది. నకిలీ గుర్తింపు కార్డును ఎలా సంపాదించాడు? తాను అధికారినని ఎందుకు చెప్పుకున్నాడు? తుపాకీతో ఉన్న బాడీగార్డుతో కలిసి ప్రధాని కార్యక్రమం జరిగే ప్రదేశంలోకి ఎందుకు రావడానికి ప్రయత్నించారు? అనే అంశాలపై ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది.

మొదటిపేజీ తరువాయి

పధాని పర్యటనలో తుపాకి కలకలం

అయితే, ప్రస్తుతానికి ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకునే ఉద్దేశంతో వారు అక్కడికి వచ్చినట్లు ఎలాంటి అధికారిక సమాచారం వెలువడలేదు. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ సెప్టెంబర్ 8న సాయంత్రం 5:45 గంటల సమయంలో ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026ను ప్రారంభించనున్నారు. సెప్టెంబర్ 8 నుంచి 11 వరకు జరిగే ఈ ఏడో ఎడిషన్‌లో ఫైనాన్స్ భవిష్యత్తు, ఏజెంటిక్ , టోకెనైజేషన్, క్వాంటమ్ టెక్నాలజీ, డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సమ్మిళితంపై చర్చలు జరగనున్నాయి. అంతకుముందు ప్రధాని గుజరాత్‌లోని వడోదరలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకిత కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులో రూ.20,700 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌లోని 326 రూట్ కిలోమీటర్ల మూడు కీలక విభాగాలు ఉన్నాయి.ప్రధాని ముంబై పర్యటనకు ముందు నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో ఇద్దరు వ్యక్తులు పట్టుబడటం భద్రతా వ్యవస్థను అప్రమత్తం చేసింది. ఈ ఘటన వెనుక అసలు ఉద్దేశం ఏంటన్నది క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో తేలాల్సి ఉంది.

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా స్వీకరించిన పోతులపల్లి కమలాకర్.

చిన్నంబావి మండలం తెలంగాణ మంజీరా

హైదరాబాద్: బెక్కెం గ్రామానికి చెందిన పోతులపల్లి కమలాకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ సాధించారు. సెప్టెంబర్ 8న ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ఆయన పీహెచ్‌డీ పట్టాను స్వీకరించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో సౌర విద్యుత్, పవర్ మేనేజ్‌మెంట్ అంశంపై పరిశోధన చేసి కమలాకర్ డాక్టరేట్ సాధించారు. బెక్కెం గ్రామం నుంచి ఉన్నత విద్యలో రాణించి డాక్టరేట్ సాధించడం పట్ల గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

హనుమాన్ ఆలయం వద్ద అన్నప్రసాదన్న కార్యక్రమం

తెలంగాణ మంజీరా / (మెదక్)చిన్న శంకరం పేట సెప్టెంబర్ 8

మెదక్ పిల్లి కోటల ఫ్యాక్టరీ దేవాలయం పూజారి పంతులు హనుమాన్ ఆలయం వద్ద శ్రావణమాసం లాస్ట్ మంగళవారం సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ కరణం ప్రభాకర్, ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు

కరణం ప్రభాకర్ మాట్లాడుతూ,ఎలాంటి ఆదరణకు నోచుకోని 108 హనుమాన్ విగ్రహాలు యావ తెలంగాణ రాష్ట్రం లోపల ఎక్కడైనా సరే మేము అక్కడికి వచ్చి చందన పూజ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని ,తెలియజేశారు .నేటికీ ఈరోజ లాస్ట్ శ్రావణమాసం మంగళవారం కి 80 కి పూర్తి చేసుకున్నమన్నారు. ఇంకా 28 పూర్తి చేయవలసినవి ఉన్నాయని ఇలాంటి ఆదరణ విగ్రహాలు ఎక్కడ ఉన్నా కూడా హిందూ ధర్మ కోసం ధర్మం కాపాడే వాళ్లమౌవుతామని మీడియా సమావేశం ద్వారా తెలియజేశారు. ముఖ్య విషయం ఏమనగా విగ్రహాలను తొక్కే వాటికే మొక్కేలా చేయడమే మా ఇందు ధర్మం అని ఆ విధంగా మేము ముందుకు సాగుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ ప్రాంత భక్తులు అన్నదాన ప్రసాదంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ పోలీస్ అసోసియేషన్ సెక్రటరీగా మద్ది మహేందర్ రెడ్డి

ఇబ్రహీంపట్నం సీఐకి కీలక బాధ్యతలు.. పోలీస్ అధికారుల సంక్షేమానికి కృషి చేస్తానని వెల్లడి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 08 తెలంగాణ మంజీరా

రంగారెడ్డి జిల్లా, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సివిల్ ఫోర్స్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మద్ది మహేందర్ రెడ్డి సెక్రటరీగా ఎన్నికయ్యారు. పోలీస్ అధికారుల సంక్షేమం, సమస్యల పరిష్కారం, విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో అసోసియేషన్ కీలక పాత్ర పోషించనుంది.సెక్రటరీగా ఎన్నికైన మద్ది మహేందర్ రెడ్డికి పోలీస్ అధికారులు, సిబ్బంది, సహచరులు అభినందనలు తెలిపారు. బాధ్యతాయుతమైన పదవికి ఎన్నిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో తనకున్న అనుభవాన్ని ఉపయోగిస్తూ పోలీస్ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మద్ది మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి సెక్రటరీగా ఎన్నుకున్న పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ సెక్రటరీగా తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. పోలీస్ అధికారుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తూ, వారి సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.పోలీస్ అధికారులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలు, విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై అసోసియేషన్ తరఫున సమన్వయంతో ముందుకు సాగుతామని తెలిపారు. పోలీస్ శాఖలో అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు మరింత మెరుగైన పోలీసింగ్ అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం సీఐగా విధులు నిర్వహిస్తూ మరో కీలక బాధ్యతను చేపట్టిన మద్ది మహేందర్ రెడ్డి ఎన్నిక పట్ల స్థానికంగా కూడా పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.కొత్త బాధ్యతల్లో ఆయన విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.

సింగారంలో ఘనంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు.

బయ్యారం,తెలంగాణ మంజీరా,సెప్టెంబర్ 8.

ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలను సింగారం గ్రామపంచాయతీలో సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.గ్రామస్తుల సమక్షంలో ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కనకన్న ప్రజాసేవలో మరెన్నో సంవత్సరాలు కొనసాగాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చుంచు మమత,గ్రామ అధ్యక్షులు గంగవత్ రాంకీ నాయక్,వార్డు సభ్యులు,గ్రామ నాయకులు,మహిళలు పిల్లలు పాల్గొన్నారు.

మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడిపై చర్యలేవి?

హైదరాబాద్,సెప్టెంబర్8(తెలంగాణ మంజీరా):

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీ వద్ద జరిగిన అమానుష ఘటనపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, అక్కాచెల్లెమ్మలకు జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుందని హరీష్ రావు అన్నారు. అయితే అవమానం జరిగింది నీ తల్లికి కాదు, మా అమ్మకు అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడిలో పోలీసులపై చర్యలను మంత్రి శ్రీధర్ బాబు పరిశీలిస్తామని అన్నారు. సబితక్క గొంతునొక్కారు, మగ పోలీసులు ఈ పని చేసినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంటే.. దీనిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సునీతా లక్ష్మారెడ్డిని చీర లాగి అవమానిస్తే.. ఆ పోలీసులపై చర్యలు తీసుకోవడానికి బదులుగా వీరిపైనే కేసులు నమోదు చేసి వేధించడం ఏంటని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాల్సిందిపోయి, వారిపై కేసులు నమోదు చేసి వేధించడంపై హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని, ఇది గౌరవసభ కాదని, కౌరవ సభగా మారిందంటూ మండిపడ్డారు. ఆనాడు కౌరవులకు పట్టిన గతే మీకు పడుతుందని, ఈ విషయాలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురించి మాట్లాడుతూ.. మీరంటే నాకు చాలా గౌరవం, చాలా ఇష్టం. చాలా ఏళ్ల నుంచి సభలో మీతో కలిసి పనిచేశాం. ఎమ్మెల్సీ తాతా మధు తాను స్పీకర్‌ను ఉద్దేశించి ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఒకవేళ మీరు మిమ్మల్ని అన్నారని భావిస్తే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానంటూ విచారం వ్యక్తం చేశారు. మీ ప్రభుత్వానికి నిజంగానే ఎస్సీ, ఎస్టీలపై చిత్తశుద్ధి ఉంటే డిక్లరేషన్ ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేయకుండా తాళం ఎందుకు వేశారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. మహిళా ప్రజాప్రతినిధులను ప్రభుత్వం గౌరవిస్తుంది. సభాధ్యక్షుడిగా నాకు కూడా గౌరవం ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. అయితే మహిళా ఎమ్మెల్యేలపై కేసులు పెట్టారని హరీష్ రావు ప్రస్తావించగా.. మీరు చెప్పింది మేం విన్నాం. మేం చెప్పింది కూడా వినండి. హరీష్ రావు మీకు కాదు, నాకు ఉండాలి ఆవేశం. వాళ్లు అన్నది నీ తల్లిని కాదు, నా త్లలిని అవమానించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మీలు నాకు సోదరిమణుల్లాంటి వారు. వారిపట్ల నాకు గౌరవం ఉంది. నా తల్లిని మాటలు అన్నారు, అనుచిత వ్యాఖ్యలు చేశారు దీనికి ఏం సమాధానం చెబుతావు హరీష్ రావు అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభలో గట్టిగానే ప్రశ్నించారు.

స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యల తీసుకోవాలని కొత్తపేటలో కాంగ్రెస్ శ్రేణుల రాస్తారోకో.

బయ్యారం,తెలంగాణ మంజీరా,సెప్టెంబర్ 8.

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు సోమవారం స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా మంగళవారం కొత్తపేట బస్టాండ్ సెంటర్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కొత్తపేట గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్, పార్టీ మండల అధ్యక్షులు జులకంటి సీతారాం రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ దళితుడైన స్పీకర్ పై ఇష్టానురీతిలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు నోరు పారేసుకోవడం చాలా బాధాకరమని, వెంటనే స్పీకర్ కు క్షమాపణ చెప్పాలని లేనియెడల అతనిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ పంచాయతీ సర్పంచ్ లు లింగ నాయక్,ప్రేమలత సేవాలాల్,భూక్య రవి,గూగులోతు మంగీలాల్,ఉపసర్పంచులు,ఇతర ప్రజాప్రతినిధులు సురేష్,రాంబాబు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతే అభివృద్ధికి తొలి మెట్టు, విద్యతో ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలి,

అదనపు కలెక్టర్ దేవసహాయం,

నాగర్ కర్నూల్ తెలంగాణ మంజీరా

అక్షరాస్యతతోనే సమాజంలో చైతన్యం, అభివృద్ధి సాధ్యమవుతుందని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) దేవసహాయం అన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్న అక్షరాస్యత పక్షోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ (బి) పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ దేవసహాయం అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించేలా సమాజంలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జెండా ఊపి విద్యార్థుల అవగాహన ర్యాలీని ప్రారంభించారు.పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్రీపురం చౌరస్తా, అంబేద్కర్ విగ్రహం మీదుగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. విద్యార్థులు అక్షరాస్యత ఆవశ్యకతను తెలియజేస్తూ నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ తిరిగి పాఠశాలకు చేరుకుంది.అక్షరాస్యత పక్షోత్సవాల సందర్భంగా ప్రజల్లో విద్య ప్రాధాన్యతపై అవగాహన పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా వయోజనులు కూడా విద్యను అభ్యసించేలా ప్రోత్సహించడం, నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేయడం లక్ష్యంగా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కురుమయ్య, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు తిరుపతయ్య, ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్ జగదీశ్వర్ రెడ్డి, వయోజన విద్య జిల్లా ఇన్‌చార్జి సందీప్ కుమార్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్‌హత్యకు కుట్ర..

తెలంగాణ మంజీరా, సెప్టెంబర్8

: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. కాంగ్రెస్ నేతలు డప్పులతో ఎర్రవల్లి ఫాంహౌజ్ ముట్టడించడానికి ప్రయత్నించిన సందర్భంగా.. కేసీఆర్‌ను పరామర్శించేందుకు, ఆయనకు రక్షణగా ఎర్రవల్లికి బయలుదేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు.. హకీంపేట వద్ద అడ్డుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ సంచలన ఆరోపణలకు తెరతీశారు. కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్‌పై కుట్రపూరితంగా హత్యాయత్నానికి పాల్పడ్డాయని ఆరోపించారు. ఫామ్‌హౌస్‌కు వెళ్తున్న సమయంలో పోలీసులు కేటీఆర్‌ను అదుపులోకి తీసుకుని బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని ఆరోపించారు. కేసీఆర్ ఫాంహౌజ్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. అదే సమయంలో తమ సొంత నాయకుడి నివాసానికి వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. దీనిపై డీజీపీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నాయకులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నారని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ నివాసం వైపు కాంగ్రెస్ నేతలు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద వందలాది మంది పోలీసులను మోహరించామని అధికారులు చెప్పినప్పటికీ.. తమ నాయకుడి భద్రత విషయంలో పోలీసులపై నమ్మకం లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తమ నాయకుడిని తామే కాపాడుకోవాలి అంటూ బీఆర్ఎస్ నేతలు ముందుకు సాగారు. అసెంబ్లీ నుంచి కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎర్రవల్లి బయలుదేరారు. తొలుత బొల్లారం వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఆ తర్వాత హకీంపేట వద్ద కేటీఆర్, హరీశ్‌రావులను నిలిపివేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కేసీఆర్ ఇంటి వైపు వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులకు అనుమతి ఇచ్చారా అని కేటీఆర్ పోలీసులను ప్రశ్నించారు. కేసీఆర్ నివాసం వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని పోలీసులు వివరించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు వెనక్కి తగ్గలేదు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు పాదయాత్రగా

గంధంపల్లిలో ఘనంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలు.

బయ్యారం,తెలంగాణ మంజీరా,సెప్టెంబర్ 8.

ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదిన వేడుకలను గంధంపల్లి కొత్తపేట పంచాయతీలో సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి,పార్టీ కార్యకర్తలు,గ్రామ ప్రజలు కేక్ తినిపించుకొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం గ్రామ ప్రజల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి,బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూలకంటి సీతారామరెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రజల సంక్షేమం,నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు.కనకన్నకు ఆయురారోగ్యాలు,దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామ పెద్దలు, మహిళలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే కోరం కనకయ్యకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్ ఫోకస్,

బెక్కెరలో నిర్మాణ పనుల పరిశీలన, ఆకర్షణీయంగా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు అభినందన,అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,

నాగర్ కర్నూల్ తెలంగాణ మంజీరా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఇళ్లను సుందరంగా నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. కల్వకుర్తి మండలం బెక్కెర గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించిన కలెక్టర్, ఆయా ఇళ్ల నిర్మాణ పురోగతిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో, ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయం తదితర అంశాలపై వివరాలు సేకరించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అధికారులు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్లను ఆకర్షణీయంగా, సుందరంగా నిర్మించుకుని చక్కగా తీర్చిదిద్దుకున్న పలువురు లబ్ధిదారులను కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లను అందంగా నిర్మించుకోవడం అభినందనీయమని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, చిన్నారులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు, అంగన్వాడీ కేంద్రం నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పౌష్టికాహారం, ఇతర సేవలు అందేలా చూడాలని సూచించారు.అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల హాజరు, విద్యాబోధనతో పాటు పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై మండల విద్యాధికారి శంకర్ నాయక్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓకు సూచించారు. పాఠశాల పరిసరాలు, వాతావరణం పరిశుభ్రంగా, చక్కగా నిర్వహిస్తున్న తీరుపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే లక్ష్యం..!

డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి లో జరిగిన తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ సంఘటన్ సృజన్ అభియాన్ లో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి, హాజరైన ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ లింగం నాయక్ లు హాజరయ్యారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేయడమే ఏకైక లక్ష్యంగా ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సంగారెడ్డి పట్టణం లో జరిగిన ఆదివాసి కాంగ్రెస్ జిల్లా కమిటీ ఎన్నికకోసం ఏర్పాటుచేసిన సంఘటన్ సృజన్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందునుండి దేశ ప్రజలకు సేవ చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. స్వర్గీయ ఇందిరాగాంధీ ఆదివాసీలకు ప్రత్యేక గుర్తింపు నిచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ లింగం నాయక్ మాట్లాడుతూ ఆదివాసీలు, యానాదిలు, చెంచులు మొదటినుండి కాంగ్రెస్ పార్టీ కి అండగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతీ గిరిజనుడి కి గుర్తింపు ఇచ్చేందుకు సంఘటన్ సృజన్ అభియాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జిల్లా కమిటీ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్,జిల్లా అధ్యక్షుడు రామ్ చందర్ నాయక్, ఇంచార్జీ కిషన్ నాయక్,బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జార్జ్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ శ్రేణుల వినతిపత్రం

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం,బిఆర్ఎస్ నాయకుల అరెస్టు

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనను నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఏడు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన చేపట్టాయి. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచనల మేరకు పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వం, పోలీసు అధికారులు వ్యవహరించిన తీరును బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించారు. ప్రజల సమస్యలను ప్రస్తావించేందుకు అసెంబ్లీకి వచ్చిన ప్రజాప్రతినిధులపై నిర్బంధాలు, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి మాట్లాడే హక్కు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉందని, ఆ హక్కులను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం సరికాదని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. "ఆరు గ్యారంటీలు అమలు చేయాలి.. 420 హామీలు నెరవేర్చాలి", "కాంగ్రెస్ ప్రభుత్వం డౌన్ డౌన్" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చింతా సాయినాథ్, మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజల పక్షాన ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ద్వారా ఉద్యమాలను అణచివేయలేరని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నించినందుకు అరెస్టులు చేయడం కాదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతని బిఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, హకీమ్, విజేందర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, చింతా సాయినాథ్, మందుల వరలక్ష్మి, డాక్టర్ శ్రీహరి, నాగరాజు గౌడ్, యువజన నాయకులు శ్రవణ్ రెడ్డి, వాజిత్, వేణుగోపాలస్వామితో పాటు పెద్ద ఎత్తున యువకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళిత స్పీకర్‌పై వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన

బిఆర్ఎస్ ఎమ్మెల్సీని తక్షణమే సస్పెండ్ చేయాలి

కాట సుధా శ్రీనివాస్ గౌడ్

పటాన్‌చెరు, తెలంగాణ మంజీరా న్యూస్ :

దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసిన అహంకారపూరిత, అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పటాన్‌చెరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. డివిజన్‌లోని గాంధీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాట సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రజా ప్రతినిధులు హుందాతనంతో వ్యవహరిస్తూ రాజ్యాంగ విలువలను గౌరవించాలని సూచించారు. దళిత స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పదవులకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు గౌరవం ఉండేలా ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి జయవంతం కాంగ్రెస్ నాయకుల నిరసన

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

అసెంబ్లీ ఆవరణలో దళిత శాసనసభ స్పీకర్ గౌరవనీయులు గడ్డం ప్రసాద్ కుమార్, ను బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దుర్భాషలతో, అనుచిత వ్యాఖ్యలతో అవమానపరిచిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవమానకర చర్యకు నిరసనగా తెలంగాణ రాష్ట్రఎస్ సి, సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు జిల్లాఎస్ సి, సెల్ కమిటీ చైర్మన్ గంగేరి శ్రీహరి ఆధ్వర్యంలో ఈరోజు సంగారెడ్డి కాంగ్రెస్ నాయకులు ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడికి బయలుదేరారు. బిర్ఎస్, అధినేత కేసీఆర్, కే టి ర్, హరీష్ రావు, ఎమ్మెల్సీ తాతా మధులకు వ్యతిరేకంగా 2వేల డప్పులతో ఎర్రవెల్లి గ్రామంలోని కేసీఆర్ ఫాంహౌస్ ను చుట్టుముట్టి నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా పోలీసులతో తోపులాట జరిగింది. అనంతరం సంగారెడ్డి జిల్లా ఎస్ సి, సెల్ కమిటీ, టౌన్ కమిటీ, మండల కమిటీ సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడినబి ర్ ఎస్, నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ సి, కమిటీ సభ్యులు, సంగారెడ్డి జిల్లా, టౌన్, మండల కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న "చలో హైదరాబాద్ మహాధర్నా పోస్టర్‌ను టీజీఈజేఏసీ సంగారెడ్డి జిల్లా చైర్మన్ మొహమ్మద్ జావీద్ అలీ, సెక్రటరీ జనరల్ డాక్టర్ వైద్యనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జావీద్ అలీ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడం, బకాయిలను వెంటనే విడుదల చేయడం, ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడం, పెన్షన్ సంబంధిత సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. 10న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న చలో హైదరాబాద్ మహాధర్నాను విజయవంతం చేసేందుకు టీఎన్జీవోలు గెజిటెడ్ అధికారుల సంఘం, టీచర్స్ అసోసియేషన్, సీపీఎస్ సంఘం, పెన్షనర్స్ అసోసియేషన్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మరియు అన్ని శాఖల ఉద్యోగులందరు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీఎన్జీవోలు గెజిటెడ్, టీచర్స్ అసోసియేషన్, సీపీఎస్ సంఘం, పెన్షనర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మరియు అన్ని శాఖల ఉద్యోగులు, అఖిలేష్ రెడ్డి, జగదీష్, టీఎన్జీవో సెక్రెటరీ వేల్పూరు రవి, అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు నిర్మల రాజకుమారి, తాలూకా అధ్యక్షులు ప్రమోద్ కుమార్, వెంకటేష్, జగన్, వెంకట్, సాయి, షరీఫ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో గణేష్ మండప నిర్వాహకులతో పోలీసుల సమావేశం

జాగ్రత్తలు పాటించాలని సూచన

సంగారెడ్డి సెప్టెంబర్ 08 తెలంగాణా మంజీరా న్యూస్

వినాయక చవితి పండుగ సందర్భంగా సంగారెడ్డి రూరల్ సీఐ, ఎస్ఐ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పీసర్ గార్డెన్ లో గణేష్ మండప నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండపాల ఏర్పాటు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నిర్వాహకులకు వివరించారు. ముఖ్యంగా కరెంటు తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, మండపం ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో పూర్తి వివరాలు, రూట్ మ్యాప్ వివరాలను పోలీస్ శాఖకు సమర్పించాలని సూచించారు. నిబంధనలు పాటిస్తూ మండపాల నిర్వహణకు పోలీస్ శాఖ తరపున పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డికి చెందిన గణేష్ మండప నిర్వాహకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిలర్ సతీష్ రెడ్డికి ఘన సన్మానం

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

స్వచ్ఛ వాయు సర్వేక్షణ-2026 రాష్ట్ర స్థాయి అవార్డు కు ఎంపికైన 31వ వార్డు స్వచ్ఛ వాయు సర్వేక్షణ--2026లో రాష్ట్ర స్థాయిలో మున్సిపాలిటీకి గుర్తింపు లభించింది. మంగళవారం 31వ వార్డుకు రూ.10 లక్షల రూపాయల రివార్డు లభించిన సందర్భంగా కౌన్సిలర్ సతీష్ రెడ్డిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి లు సన్మానించారు.వంద శాతం డోర్ టు డోర్ కలెక్షన్, 60 శాతం సోర్స్ సెగ్రిగేషన్, వార్డులో గ్రీన్ డెవలప్‌మెంట్, ప్రతి వీధికి డ్రైనేజ్ క్లీనింగ్ చేపట్టడం వంటి అంశాలకు గాను ఈ అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డు తో పాటు వార్డు అభివృద్ధికి రూ.10 లక్షల రివార్డు సైతం లభించినట్లు సతీష్ తెలిపారు. అవార్డు సాధించేందుకు సహకరించిన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కమిషనర్, అధికారులకు, ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సి.

బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

జహీరాబాద్, తెలంగాణ మంజీరా న్యూస్ :

బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్   ఫామ్‌హౌస్ ముట్టడి కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా నాయకులను అదుపులోకి తీసుకుని జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేసే హక్కును ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్ట్ చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన భయాన్ని బయటపెట్టుకుంటోందని విమర్శించారు. బిఆర్ఎస్ నాయకులను అణచివేయడం ద్వారా ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని ఆపలేరని, ప్రజాస్వామ్య హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

జహీరాబాద్, తెలంగాణ మంజీరా న్యూస్ :

బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడి కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా నాయకులను అదుపులోకి తీసుకుని జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలియజేసే హక్కును ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్ట్ చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన భయాన్ని బయటపెట్టుకుంటోందని విమర్శించారు. బిఆర్ఎస్ నాయకులను అణచివేయడం ద్వారా ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని ఆపలేరని, ప్రజాస్వామ్య హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నల్లవాగు కుడి కాలువలో పూడికతో వరి నాట్లు ఎండిపోతున్నాయ్
కాలువ పూడిక తీతకు రూ.5 లక్షలు
జిల్లా కలెక్టర్ కు రైతులు వినతి

నారాయణఖేడ్, తెలంగాణ మంజీరా న్యూస్ :

సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని నల్లవాగు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు గ్రామాలైన కృష్ణాపూర్, మూర్తి, ఇంద్రానగర్, కల్హేర్ గ్రామాలకు చెందిన కుడి కాలువ రైతులు మంగళవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఆగస్టు 2న నల్లవాగు ప్రాజెక్టు నీటిని విడుదల చేయగా 24 గంటల్లో కుడి కాలువ ద్వారా తమ భూములకు చేరాల్సిన సాగు నీరు ఇప్పటి వరకు చేరలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత 3 సంవత్సరాలుగా కాలువలో పూడిక తొలగించక పోవడంతో కాలువ పూర్తిగా పూడికతో నిండిపోయిందని, వర్షపు నీటితో వేసిన వరి నాట్లు ప్రస్తుతం ఎండి పోయే దశలో ఉన్నాయని తెలిపారు. నీటి పారుదల అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని డీమఫ్, కృషల్ బాలన్స్ లేదా సీస్సార్ ఫండ్ నుండి కుడి కాలువకు రూ.5లక్షలు మంజూరు చేసి, మిషినరీలు పెట్టి కాలువ పూడికను తొలగించి తమ వరి పంటలను కాపాడాలని, అలాగే 12 గంటల కరెంటు కూడా రావడం లేదని, కరెంటు కోతలను నివారించి 12 గంటల కరెంటు వచ్చేలా అధికారులను ఆదేశించాలని రైతులు తమ వినతిలో కోరారు.

అసభ్యంగా మాట్లాడిన ఎమ్మెల్సీని సస్పెండ్ చేయాలి
దళిత సంఘాల నాయకులు డిమాండ్

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

దళిత స్పీకర్ పై అసభ్య దురుస్సుగా మాట్లాడిన వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని మంగళవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి కేంద్రం ప్రభుత్వ అతిథి గృహం అంబేద్కర్ సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల అసభ్య పదజాలంతో మాట్లాడిన ఎమ్మెల్సీని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ అసత్యపు ఆరోపణలు చేస్తున్న వారిపై చెర్యలు తీసుకోవాలని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం లో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పంబల్ల దుర్గా ప్రసాద్, ఉపాధ్యక్షులు మల్లేష్ యాదవ్,కే నాగరాజు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ సంచుల, ప్రజా సంఘాల నాయకులు అనంతయ్య సార్, ప్రకాష్ రాథోడ్, సురేష్, వేణు , బంగారు కృష్ణ, అనిల్, కెవిపిఎస్ అశోక్, మొగులయ్య, ప్రమోద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రజాప్రతినిధులపై దాడిని ఖండిస్తున్నాం
బిఆర్ఎస్ నాయకులు నిరసన

పటాన్ చెరు, తెలంగాణ మంజీరా న్యూస్ :

అసెంబ్లీ గేటు వద్ద బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడిని ఖండిస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగింది. శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి యాదమ్మ మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొని మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీ గూడెం మధుసూదన్ రెడ్డి, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మైత్రి మైదానం నుంచి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మహిళా ప్రజాప్రతినిధులపై దాడిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ప్రజా స్వామ్య విలువలను, ప్రజా ప్రతినిధుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.

మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడిపై చర్యలేవి?

వారికి జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుంది దాడిపై అసెంబ్లీలో ప్రశ్నించిన హరీష్ రావు

నీ తల్లికి కాదు మా అమ్మకు అవమానం జరిగింది ఘాటుగా బదులిచ్చిన స్పీకర్ గడ్డం ప్రసాద్

హైదరాబాద్,సెప్టెంబర్8(తెలంగాణ మంజీరా):

బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీ వద్ద జరిగిన అమానుష ఘటనపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, అక్కాచెల్లెమ్మలకు జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతుందని హరీష్ రావు అన్నారు. అయితే అవమానం జరిగింది నీ తల్లికి కాదు, మా అమ్మకు అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడిలో పోలీసులపై చర్యలను మంత్రి శ్రీధర్ బాబు పరిశీలిస్తామని అన్నారు. సబితక్క గొంతునొక్కారు, మగ పోలీసులు ఈ పని చేసినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంటే.. దీనిపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సునీతా లక్ష్మారెడ్డిని చీర లాగి అవమానిస్తే.. ఆ పోలీసులపై చర్యలు తీసుకోవడానికి బదులుగా వీరిపైనే కేసులు నమోదు చేసి వేధించడం ఏంటని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాల్సిందిపోయి, వారిపై కేసులు నమోదు చేసి వేధించడంపై హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని, ఇది గౌరవసభ కాదని, కౌరవ సభగా మారిందంటూ మండిపడ్డారు. ఆనాడు కౌరవులకు పట్టిన గతే మీకు పడుతుందని, ఈ విషయాలు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురించి మాట్లాడుతూ.. మీరంటే నాకు చాలా గౌరవం, చాలా ఇష్టం. చాలా ఏళ్ల నుంచి సభలో మీతో కలిసి పనిచేశాం. ఎమ్మెల్సీ తాతా మధు తాను స్పీకర్‌ను ఉద్దేశించి ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఒకవేళ మీరు మిమ్మల్ని అన్నారని భావిస్తే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానంటూ విచారం వ్యక్తం చేశారు. మీ ప్రభుత్వానికి నిజంగానే ఎస్సీ, ఎస్టీలపై చిత్తశుద్ధి ఉంటే డిక్లరేషన్ ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేయకుండా తాళం ఎందుకు వేశారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. మహిళా ప్రజాప్రతినిధులను ప్రభుత్వం గౌరవిస్తుంది. సభాధ్యక్షుడిగా నాకు కూడా గౌరవం ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. అయితే మహిళా ఎమ్మెల్యేలపై కేసులు పెట్టారని హరీష్ రావు ప్రస్తావించగా.. మీరు చెప్పింది మేం విన్నాం. మేం చెప్పింది కూడా వినండి. హరీష్ రావు మీకు కాదు, నాకు ఉండాలి ఆవేశం. వాళ్లు అన్నది నీ తల్లిని కాదు, నా తల్లిని అవమానించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మిలు నాకు సోదరిమణుల్లాంటి వారు. వారిపట్ల నాకు గౌరవం ఉంది. నా తల్లిని మాటలు అన్నారు, అనుచిత వ్యాఖ్యలు చేశారు దీనికి ఏం సమాధానం చెబుతావు హరీష్ రావు అని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభలో గట్టిగానే ప్రశ్నించారు. అసెంబ్లీ వద్ద సోమవారం నాడు సభ్యుల తీరుపై మంత్రి సీతక్క అసెంబ్లీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా పోలీసుల ముందు బట్టలు విప్పాల్సిన అవసరమేంటని, స్పీకర్‌ను, ఆయన తల్లిని దూషించడం కరెక్టేనా అని నిలదీశారు. పోలీసులపై దాడి చేసిన, స్పీకర్‌ను దూషించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభలో రూల్స్ తెచ్చిన నేతలే వాటిని ఉల్లంఘిస్తూ అసభ్యకర భాషతో మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అయితే, తమ చీరలు లాగి కొట్టారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. నిజంగా దాడి జరిగితే విచారించి బాధ్యులైన పోలీసులపై కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామని సీతక్క స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్
సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు
ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు తీర్మానం

హైదరాబాద్,సెప్టెంబర్8(తెలంగాణ మంజీరా):

తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు. కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.